మలివయస్సులో.. ముసి ముసి నవ్వులు

ప్రత్తిపాడు: వారందరి వయస్సు ఆరు పదుల పైమాటే. కర్ర ఊతం లేనిదే కాలు ముందుకు పడని పండు ముదుసలులూ మరెందరో. పేగు బంధాలకు దూరంగా.. సత్తువ లేని కాళ్లు, చేతులతో బతుకు పోరాటం చేస్తున్నావారూ లేకపోలేదు. నా అనుకున్న వారిపై ఆధార పడకుండా ఆత్మస్థైర్యంతో అడుగులు వేసేవాళ్లూ ఉన్నారు. అలాంటి వారందరికీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్ద కొడుకులా అండగా నిలుస్తున్నారు. సంక్షేమమే పరమావధిగా.. అర్హతే ప్రామాణికంగా పాలనలో కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. ఎప్పటికప్పుడు కొత్త పింఛన్లు మంజూరు చేస్తూ పండుటాకుల మోముల్లో చిరునవ్వులు చిందిస్తున్నారు. ప్రత్తిపాడు మండలంలో 118 మందికి నూతనంగా పింఛన్లు మంజూరయ్యాయి. దీంతో వేకువజామునే వాలంటీర్లు తమ ఇంటి తలుపు తట్టి అవ్వా, తాతా.. మీకు పింఛను వచ్చేసిందంటూ రూ. 2,750 రూపాయలను వారి చేతికందించడంతో అవ్వాతాతల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి.


వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో నూతన పింఛన్లతో అవ్వాతాతల ఆనందం

నూతన పింఛన్ల పండుగ

గుంటూరు రూరల్: ప్రతి ఇంటి పెద్దకొడుకుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 1వ తేదీనే పింఛన్లు అందిస్తున్నారని మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఇంటూరి పద్మావతి అన్నారు. చల్లావారిపాలెం గ్రామంలో నూతనంగా మంజూరైన 20 వృద్ధాప్య, వితంతు, దివ్యాంగ పింఛన్లను ఆమె శుక్రవారం పంపిణీ చేశారు. మండలంలో ఇప్పటికే 4,549 మందికి పింఛన్లు అందజేస్తుండగా.. ఈ నెల నూతనంగా 135 పింఛన్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మరో 169 నూతన పింఛన్లు మంజూరుకు వెరిఫికేషన్ దశ పూర్తి చేసుకున్నాయని తెలిపారు. 5న లబ్ధిదారులకు పంపిణీ చేసే.. కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ లబ్ధి

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య
- నంబూరులో గడప గడపకు మన ప్రభుత్వం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. నంబూరులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేయడం జరిగిందన్నారు. ప్రతి గడపకూ వెళ్లిన ఎమ్మెల్యే రోశయ్య.. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా, సకాలంలో పింఛను ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. నంబూరులో ఎమ్మెల్యేకు అడుగడుగునా ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమములో ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, సర్పంచి నంబూరు జ్యోతి, ఎంపీడీఓ బీవీ మల్లేశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ చాగంటి మురళీమోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు వుయ్యూరు సతీష్‌రెడ్డి, ఎంఎస్ఎంఈ భీమవరపు విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, మందాళ శివారెడ్డి, సయ్యద్ సుభాని, జొన్నల అవినాష్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పలువురు అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

బీఎల్వో వచ్చారా.. ఓటు ఎందుకు తొలగించారు..

క్షేత్రస్థాయి పరిశీలనలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి



పెదకాకాని: మండలంలోని ఉప్పలపాడులో తొలగించిన ద్వంద, మృతుల ఓట్లు, కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. వాస్తవాలను క్షేత్రస్థాయిలో ప్రత్యేక్షంగా తెలుసుకున్నారు. బీఎల్వోలు ఇంటికి వచ్చి చనిపోయిన, స్థానికంగా నివాసం లేని వారి వివరాలు సేకరించినట్లు కలెక్టర్‌కు స్థానికులు తెలియజేయడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. డీఆర్డీఏ పీడీ, పొన్నూరు నియోజకవర్గ ఈఆర్ఓ హరిహరనాథ్, పెదకాకాని తహసీల్దారు పి.రత్నం, బీఎల్ఓ జహాసన, సూపర్‌వైజర్లు కలెక్టర్ వెంట ఉన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టిసారించండి..

బోడిపాలెం సచివాలయంలో జేసీ ఆకస్మిక తనిఖీ

బోడిపాలెం(కాకుమాను): గ్రామాల్లోని ప్రజలకు సకాలంలో ప్రభుత్వ పథకాలను అందించి, మౌలిక వసతులను కల్పించాలనే లక్ష్యంతో గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువస్తే.. సిబ్బంది కేవలం నాలుగు గోడలకే పరిమితమైతే ఎలా..? అని జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని బోడిపాలెం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్ని పథకాలను అమలు చేసింది, వారికి ఏ రకంగా సాయం అందించింది.. తదితర నివేదికలు సిబ్బంది వద్ద లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలపై కనీస అవగాహన లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని జేసీ సిబ్బందికి సూచించారు. శాఖల వారీగా సమగ్ర నివేదికలను అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి షేక్ అసదుల్లా, తహసీల్దారు జె.ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న కార్యకర్తలకు పరామర్శ

పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఫ్లెక్సీల ఏర్పాటులో జరిగిన వివాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను పార్టీ నాయకులు శుక్రవారం పరామర్శించారు. నిడుబ్రోలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న పఠాన్, జహీర్‌ను మండల వ్యవసాయ శాఖ సలహా మండలి చైర్మన్ లంకపోతు పిచ్చిరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ బోర్డు సభ్యుడు షేక్ సైఫుల్లా, పొన్నూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, దండమూడి సర్పంచ్ భవనం వంశీ రెడ్డి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు పరామర్శించారు.



యువకుడి ఆత్మహత్యాయత్నం

చేబ్రోలు: కుటుంబ సమస్యల కారణంగా ఓ యువకుడు ఎలుకల మందు తిని, ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన పాతరెడ్డిపాలెంలో శుక్రవారం చోటుచేసుకుంది. పి.జాన్ అనే యువకుడు కుటుంబ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ఎలుకల మందు తినడంతో.. కుటుంబ సభ్యులు అతనిని 108 అంబులెన్స్‌లో తెనాలి పభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు.

నారాకోడూరులో క్రికెటర్ అంబటి రాయుడి పర్యటన



చేబ్రోలు: చేబ్రోలు మండలం గొడవర్రు, నారాకోడూరు గ్రామాల్లో క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు శుక్రవారం పర్యటించారు. గొడవర్రు శివాలయం, మసీదు, చర్చిలో స్థానికులతో కలిసి ప్రార్థనలు చేశారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. గ్రామస్తులతో సమావేశమై సమస్యలను తెలుసుకున్నారు. నారాకోడూరులోని ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు. వారితో కొద్ది సేపు సరదాగా క్రికెట్ ఆడారు. విద్యార్థులు అంబటి రాయుడితో సెల్ఫీలు దిగారు.

పంట నమోదు వేగవంతం చేయాలి

పెదకాకాని: పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని గుంటూరు ఏడీఏ టి.శ్రీనివాసరావు ఆదేశించారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామ శివారులో పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సెప్టెంబరు 15 లోగా ఈ-క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఈకేవైసీ కూడా పూర్తి చేయాలని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకూ 11 వేల ఎకరాల్లో పంట సాగుచేస్తున్నారని, 5,100 ఎకరాల్లో మాత్రమే పంట నమోదు చేయడం జరిగిందన్నారు. ఏఓ పి.సంధ్యారాణి ఉన్నారు.

వీవీఐటీలో భారత్ బ్లాక్ చైన్ యాత్ర

పెదకాకాని: ఇన్‌ఫర్మేషన్ డేటా సిస్టమ్స్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రోత్సాహంతో భారత్ బ్లాక్ చైన్ యాత్ర 4వ ఈవెంట్‌ను వీవీఐటీలో శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డిజిటల్ కరెన్సీ, ఐడీ, ఓటింగ్, డేటా షేరింగ్ వంటి సాంకేతిక అంశాల పరిరక్షణ కొరకు వినియోగించే బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై అపోహలు తొలగించి, సాంకేతిక విలువలను పెంపొందించేందుకు ఈ యాత్ర దోహదపడుతుందన్నారు. ఈ యాత్రలో ముఖ్య అతిథులుగా భారత బ్లాక్ చెయిన్ యాత్ర కన్వీనర్ అరవింద్ ఓరుగంటి, ఐడీఎస్ బిజినెస్ హెడ్ సునీల్ యడవల్లి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అరవింద్ ఓరుగంటి మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ అనేది పటిష్ఠమైన సైబర్ సెక్యూరిటీ టెక్నాలజీ వ్యవస్థ అన్నారు. అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, అడ్మిన్ డీన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎ.కళావతి పాల్గొన్నారు.